క్లుప్తంగా

నేడు బహిరంగ వేలం

చారకొండ: మండల పరిధిలోని సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈనెల 27 నుంచి ఏప్రిల్ 10 వరకు జరిగే సీతారామచంద్ర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో కొబ్బరి కాయలు, తలనీలాలు, కొబ్బరి చిప్పలు, లడ్డు, పులిహోర విక్రయాలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ డేరం రామశర్మ, ఈఓ రఘు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరి కాయల వేలానికి రూ.5లక్షలు, తలనీలాలకు రూ.లక్ష, కొబ్బరి చిప్పలకు రూ.50 వేలు, పులిహోర ప్రసాదాలు రూ.2లక్షల డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని చెప్పారు. వేలం దక్కించుకున్న వారు 75 శాతం చెల్లించాలని, మిగతావి రెండు రోజుల్లో చెల్లించాలని అన్నారు. వేలందారుడు నిర్ణీత సమయంలో చెల్లించకపోతే వేలం రద్దు చేయనున్నట్లు తెలిపారు.

కల్వర్టు పనుల పరిశీలన

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్‌లో నిర్వహిస్తున్న కల్వర్టు పనులను జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ గురువారం పరిశీలించారు. తర్నికల్ నుంచి కురుమిద్దెతండా మార్గంలో కల్వర్టు నిర్మాణానికి జెడ్పీ నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా పనులు పరిశీలించిన వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ పనులు నాణ్యతగా చేపట్టేలా చూడాలని సర్పంచ్ పాండుగౌడ్‌కు సూచించారు. ఆయన వెంట కల్వకుర్తి మాజీ కౌన్సిలర్ మక్బుల్ తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాల్లో హయగ్రీవ ఇష్టి పూజలు

బిజినేపల్లి: మండలంలోని అడ్డగట్టు అలమేలు మంగ వేంకటేశ్వరస్వామి వారి తృతీయ పుష్కర బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం హయగ్రీవ ఇష్టి హోమ పూజా కార్యక్రమాలను ఆలయ అర్చక బృందం ప్రధానంగా నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయం ప్రాతరాధన, అర్చన, సేవాకాలం, హోమం, బలిహారణం, అలంకరణ పూజలు నిర్వహించారు. విద్య కోసం హయగ్రీవ ఇష్టి హోమం నిర్వహించారు.

విద్యార్థులకు పండ్ల మొక్కలు

అచ్చంపేట రూరల్: మండలంలోని నడింపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం సోలార్ పవర్ ప్యాక్, బాలవికాస్ సంస్థ సహకారంతో గురువారం డ్యూయల్ డెస్క్ బెంచీలు అందజేశారు. అలాగే ప్రతి విద్యార్థికి ఇళ్ల వద్ద పెంచడానికి మామిడి, జామ మొక్కలు అందించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ జీహెచ్‌ఎం అర్జునయ్య, హెచ్‌ఎం సామ్యానాయక్, సోలార్ పవర్ ప్యాక్ ప్రతినిధులు బాలరాజు, లక్ష్మయ్య, ఉపాధ్యాయులు శ్రీశైలం, జమాలుద్దీన్, జయమ్మ, బాల వికాస వలంటీర్లు సైదులు, శంకర్ పాల్గొన్నారు.

దేశపతి శ్రీనివాస్‌ను కలిసిన చైర్మన్

కల్వకుర్తి: ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఎన్నికైన ప్రముఖ కవి దేశపతి శ్రీనివాస్, చల్లా వెంకట్రామరెడ్డిని గురువారం మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కవులకు, కళాకారులకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో చైర్మన్ సత్యం పాల్గొన్నారు.

'మహిళా ధూంధాం' పోస్టర్ ఆవిష్కరణ

వెల్దండ: మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో గురువారం ధూం ధాం పోస్టర్‌ను సర్పంచ్ భూపతిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ దినోత్సవం సందర్భంగా ఆమనగల్లు పట్టణంలో నిర్వహించే మహిళా ధూంధాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పాలది శ్రీకాంత్, కళాబృందం సభ్యులు, ఉపాధ్యాయురాలు తదితరులు ఉన్నారు.

ఉన్నతంగా ఎదగాలి

పెద్దకొత్తపల్లి: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జీసీడీఓ సూర్యచైతన్య అన్నారు. గురువారం కస్తూర్బాగాంధీ విద్యాలయంలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఎస్‌ఓ కృష్ణారెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ లత, సిబ్బంది అనూష, స్వరూప, మైథిలి, శ్రీలత, అరుణ, సరస్వతి, రంగమ్మ, విమల, రమాదేవి, పరిమళ, అరుణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితపై కక్ష్య సాధింపు తగదు

కల్వకుర్తిరూరల్: కేంద్ర ప్రభుత్వ తప్పులను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష పార్టీ నాయకులపై కేంద్ర ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలకు దిగుతుందని, అందులో భాగంగా జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవితపై ఈడీ, సీబీఐతో భయపెట్టాలని చూస్తున్నారని జాగృతి విద్యార్థి విభాగం జిల్లా కన్వీనర్ గణేశ్ గురువారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. కక్ష్య సాధింపు చర్యలను మానుకోవాలన్నారు. కవితపై ఎన్ని దర్యాప్తు సంస్థలను వేసినా భయపడేది లేదని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తామని అన్నారు.

మహిళా ఉద్యోగులకు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు



అచ్చంపేటలో మహిళా ఉద్యోగులతో జడ్జి విజయ్‌కుమార్

అచ్చంపేట రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో జడ్జి విజయ్‌కుమార్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మున్సిపల్ మహిళా కార్మికులు, పోలీస్, అటవీశాఖలో పని చేస్తున్న మహిళా సిబ్బంది, ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు కానిస్టేబుళ్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

చారకొండ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ నాగమణి, సిబ్బందిని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, మర్రిపల్లి సర్పంచ్ నరేష్ నాయక్ శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



బిజినేపల్లి కస్తూర్బా విద్యాలయంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వత్‌రెడ్డి

తెలకపల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా భుజంగరావును గెలిపించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.పర్వత్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని రాకొండ కస్తూర్బా పాఠశాల, తెలకపల్లిలోని జ్యోతిరావుపూలే బాలుర, బాలికల పాఠశాల, తెలకపల్లి బాలికల గురుకుల పాఠశాలలను సందర్శించి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు విశ్వేశ్వర్‌రెడ్డి, దోరెడ్ల శీనయ్య పాల్గొన్నారు.

కల్వకుర్తి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన హర్షవర్ధన్‌రెడ్డికి మద్దతుగా గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి , యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్ గౌడ్ పాల్గొన్నారు.

బిజినేపల్లి: ఉపాధ్యాయులకు పూర్వ వైభవం రావాలంటే ఎస్టీయూ బలపర్చిన అభ్యర్థి భుజంగరావుని గెలిపించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.పర్వత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కస్తూర్బా, నవోదయ విద్యాలయాల్లో ప్రచారం చేశారు.

పనులు వేగవంతం చేయాలి

కల్వకుర్తిరూరల్: గ్రామాల్లో కొనసాగుతున్న పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలని ఎంపీపీ మనోహర కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా పనుల వివరాలను కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు మంజూరైన పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ దేవేందర్, ఏపీఓ చంద్రసిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎంపీపీ కొమ్ము మధు

తెలకపల్లి: విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ కొమ్ము మధు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సిద్ధార్థ మోడల్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఒక్క రోజు అధికారులు, ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు విద్యా బోధన చేశారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ కొమ్ము మధు మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే లక్ష్యాలను చేరుతారన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమేశ్, లక్ష్మమ్మ, ఎక్సైజ్ ఎస్‌ఐ జనార్దన్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్, విజయ్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం



పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని 8వ అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం బాలింతలు, గర్భిణులకు ఆరోగ్యంపై అంగన్‌వాడీ టీచర్ రమాదేవి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలామృతం, గుడ్లు, ఇతర సామగ్రిని వార్డు మెంబర్ రవికుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నర్సింగ్‌రావ్

మన్ననూర్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించడం కోసం బ్యాంకు లింకేజీతో అందజేస్తున్న స్త్రీనిధి రుణాలు తిరిగి సకాలంలో చెల్లించాలని డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు మహిళలకు సూచించారు. గురువారం నిర్వహించే మండల సమాఖ్య ఈసీ సమావేశం కోరం లేకపోవడం, మరొకసారికి వాయిదా వేయడంపై ఆయన సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 17వ తేదీన ఈసీ సమావేశం కచ్చితంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులు చంద్రకళ, బాలమ్మ, ఏపీఎం రాంరెడ్డి, శ్రీనిధి మేనేజర్ లక్ష్మణ్, రామకృష్ణ, సీసీలు శ్రీనివాసులు, ప్రభాకర్, కృష్ణయ్య, మల్లేష్, సైదులు పాల్గొన్నారు.

ఘనంగా జూనియర్ కళాశాల వార్షికోత్సవం



కందనూలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు గురువారం ప్రిన్సిపాల్ జి. మాధవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి జి.వెంకటరమణ హాజరై మాట్లాడారు. సమాజంలో విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈనెల 15 నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలని తెలిపారు. అనంతరం క్రీడా పోటీలలో గెలుపొందిన కళాశాల విద్యార్థులకు బహుమతులు ప్రదానం అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పార్టీతోనే పేదల సంక్షేమం

టీపీపీసీ కార్యదర్శి కేతూరి వెంకటేశ్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న వెంకటేశ్

పెద్దకొత్తపల్లి: దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని టీపీపీసీ కార్యదర్శి కేతూరి వెంకటేశ్ అన్నారు. దేవల్‌తిరుమలాపూర్‌లో గురువారం హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో జంగయ్య, ఫరీద్, నాగరాజు, బక్కన్న, మల్లేశ్, పాపిరెడ్డి, కృష్ణయ్య, మహేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బిజినేపల్లి: గ్రామాల స్థాయిలో బూత్ కమిటీలు ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని, అందుకు చురుకుగా పని చేసే కార్యకర్తలను బూత్ కమిటీలకు కేటాయించాలని యూత్ కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొడిదెల రాము అన్నారు. గురువారం గుడ్లనర్వలో బూత్‌స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఇంటింటి ప్రచారం చేయాలని, కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిన సేవలను వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వడ్ల మోహన్, బాలస్వామి, బాలక్ష్మయ్య, మన్యం, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

బైరాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

వెల్దండ: మండల పరిధిలోని బైరాపూర్‌లో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేష్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం 155మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అలాగే పాఠశాలలో ఉప్పల ట్రస్ట్ చైర్మన్ వెంకటేష్ విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యురాలు మంజుల, ఎంపీపీ నిర్మల, చిత్తరంజన్‌దాస్, పూరి రమేష్, జగదీశ్వర్, అరవింద్, యాదమ్మ, సత్తయ్య, ఉపాధ్యాయులు రవిగౌడ్, శ్రీకాంత్, మహేష్, శేఖర్, విజేష్‌నాయక్, శంకర్‌నాయక్, తావుర్యానాయక్, ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు



పూజల్లో పాల్గొన్న మర్రి జనార్దన్‌రెడ్డి

తాడూరు: మండలంలోని ఆకునెల్లికుదురు దుందుబీ నది ఒడ్డున ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న పూజల్లో గురువారం ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ధ్వజస్తంభ ప్రతిష్ఠ, పంచామృత అభిషేకం, జలాదివాసం వంటి పూజలు చేశారు. ప్రతి ఒక్కరు భక్తి భావం కలిగి ఉండాలన్నారు. గ్రామస్తులంతా ఐక్యంతో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న పూజలు అభినందనీయమన్నారు. ఆలయాల పునరుద్ధరణకు తనవంతు సాయం ఉంటుందన్నారు. సర్పంచ్ కృష్ణవేణి ఇంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రమౌళీ దంపతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల నిర్వహణ కొనసాగింది. మూడు రోజుల పాటు వేదమంత్రాల నడుమ దుందుభి నదీ తీరమంతా మార్మోగింది. ముచ్చర్ల కుటుంబ ఆర్థిక సహాయ సహకారాలతో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

వృద్ధులకు చేయూత

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు గురువారం హిందూవాహిని సభ్యులు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. హిందూ వాహిని సభ్యుడు శశాంక్ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం మండలాధ్యక్షులు పరశురాం, వంశీ, మహేశ్, శేఖర్, సాయి, రఘు తదితరులు ఉన్నారు.

వెంకన్నకు పుష్పయాగం

బిజినేపల్లి: మండలంలోని నారదగిరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి ఆలయ అర్చకులు పుష్పయాగం నిర్వహించారు. సాయంత్రం మహా పూర్ణాహుతి, ధ్వజారోహణ కుంభప్రోక్షణ తదితర పూజా కార్యక్రమాలు జరిపించారు. గ్రామంలో ప్రజలు గురువారం హోలీ పండుగ జరుపుకొన్నారు.

గోపులాపూర్‌లో 'కంటి వెలుగు' ప్రారంభం



గౌరారంలో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ జమ్ములు

పెంట్లవెల్లి: మండల పరిధిలోని గోపులాపూర్‌లో గురువారం రెండవ విడత కంటి వెలుగు కేంద్రాన్ని సర్పంచ్ మేడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగు నింపేందుకు కంటి వెలుగు పథకం ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటనరసింహారెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాడూరు: మండలంలోని యత్మతాపూర్‌లో బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ కుర్మయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధత్వ నివారణ కోసం ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎండీ ఇస్మాయిల్, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: కంటి వెలుగును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ జమ్ములు అన్నారు. గురువారం మండల పరిధిలోని గౌరారం సర్పంచ్ జమ్ములు, గట్టురాయిపాకులలో సర్పంచ్ లక్ష్మీ కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగుతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గౌరారం ఉపసర్పంచ్ రాంరెడ్డి, కువలేశ్వర్‌రెడ్డి, మహెమూద్, ఏఎన్‌ఎం రాధిక, ఆశాకార్యకర్తలు శ్రీలత, లక్ష్మీ, అలివేల తదితరులు పాల్గొన్నారు.

వినతి

కల్వకుర్తిరూరల్: మండలంతో పాటు మండలంలోని వేపూరుకి అభివృద్ధి నిధులు మంజూరు చేయాలని మండల పరిషత్ వైస్ చైర్మన్ గోవర్ధన్ గురువారం ఎమ్మెల్సీ దయానంద్‌ను కోరారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ స్వగృహానికి వెళ్లి ఆయనను కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించడంతో పాటు వేపూరులో రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి ఎమ్మెల్సీ అభివృద్ధి నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

వెల్దండ: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో పెంచుతున్న మొక్కలపై ప్రత్యేక దృష్టి సారించని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని బొల్లంపల్లిలో నర్సరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీల్లో పెంచుతున్న మొక్కల వివరాలు, అసంపూర్తిగా ఉన్న డంపింగ్‌యార్డు, రైతువేదికలు, శ్మశాన వాటికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నర్సరీలపై గ్రీన్ నెట్ ఏర్పాటు చేయాలన్నారు. వేసవిలో ఎండతీవ్రతకు మొక్కలు ఎండిపోతాయన్నారు. అదే విధంగా నాటిన మొక్కలకు ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలన్నారు. శ్మశాన వాటిక, రైతు వేదికలు, డంపింగ్‌యార్డులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అనంతరం నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ ఈశ్వర్, టీఏలు రాజ్‌కుమార్, దేవేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ గంగమోహన్

తాడూరు: మండలంలోని చర్లతిర్మలాపురంలో కొనసాగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ గంగమోహన్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలకు పలు సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు కూలీల సంఖ్యను పెంచి పనులపై కూలీలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి రోజు కూలీలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియజేయాలన్నారు. కూలీలకు అవగాహన పెంచి 100నుంచి 200 వరకు కూలీలు హాజరయ్యే విధంగా చూడాలన్నారు.

మిరప పంట క్షేత్ర పదర్శన



పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి రమేశ్

తాడూరు: రైతులు సాగు చేసిన మిరప పంట తెగుళ్ల భారిన పడడంతో గురువారం వ్యవసాయాధికారి సాయిరమేశ్‌కుమార్ మండలంలోని ఐతోల్‌కు చెందిన రైతు శ్రీనుకు చెందిన మిరప పంటను పరిశీలించారు. కలాష్ అండ్ కుబేర్ సీడ్స్ సాగు చేసిన రైతుల మిరప పంట, దానిలోని గుణ గణాలను గుర్తించి రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. విత్తన ఎంపిక ముఖ్యమైందని, వైరస్, తెగుళ్లు తట్టుకునే మిరప విత్తనాలను రైతులు ఎంపిక చేసుకోవాలన్నారు. మిరప పంటలో కుళ్లు తెగులు వస్తున్నందున విత్తన శుద్ధి చేసుకోవాలని రైతులకు వివరించారు.

బీజేపీ వ్యతిరేక విధానాలపై బస్సుయాత్ర



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు

కోడేరు: బీజేపీ మతతత్వ విధానాలపై అడ్డుకట్ట వేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 30వరకు కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. బీజేపీ విధానాలను ప్రజలకు తెలియజేసేందుకు బస్సుయాత్ర నిర్వహిస్తున్నామని అన్నారు. ఈనెల 28న జిల్లా కేంద్రంలో బస్సుయాత్ర అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు తారాసింగ్, శివశంకర్, కార్తిక్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్ల పంపిణీ



పంపిణీ చేస్తున్న శివరాం, ఆనంద్

కల్వకుర్తిరూరల్: విద్యార్థులకు 10వ తరగతి తొలి మెట్టు అని, బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం అన్నారు. గురువారం పట్టణంలోని పలు పాఠశాలల్లో భారత విద్యార్థి సమితి జిల్లా నాయకులు ఆనంద్ గౌడ్ సమకూర్చిన పరీక్షా ప్యాడ్లను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిద్ధార్థ మహదేవ్, రమణ, రవిశంకర్, జయలక్ష్మీ, అనిత తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన



నర్సరీలోని మొక్కలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ

కోడేరు: మండల కేంద్రంలో ఉన్న నర్సరీని ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో ఉన్న. నర్సరీల్లో వేప, చింత, నిమ్మ, దానిమ్మ, జామ, తదితర మొక్కలు పెంచుతున్నామని, మొక్కలు ఎండిపోకుండ జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. మండలంలో ఉపాధి హామీ కూలీలు 800మంది పని చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అర్జున్, ఆయా గ్రామాల ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సౌత్ ఇండియా లెవెల్‌లో నల్లమల విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని సన్మానిస్తున్న స్కూల్ యాజమాన్యం

అచ్చంపేట రూరల్: సైనిక్ స్కూల్ ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో నల్లమల ప్రాంతానికి చెందిన విద్యార్థి సౌత్ ఇండియా లెవెల్‌లో ప్రతిభ కనబర్చాడు. బల్మూర్ మండలం తుమ్మెన్‌పేటకు చెందిన హలీం, షాహీన్ దంపతుల కుమారుడు అబ్దుల్ రహమాన్ పట్టణంలోని న్యూ ఎక్సీడ్ స్కూల్‌లో చదువుతున్నాడు. ఈ ఏడాది జనవరి 8న ఆల్ ఇండియా లెవల్‌లో నిర్వహించిన సైనిక్ స్కూల్ ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష రాశాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో అబ్దుల్ రహమాన్ సౌత్ ఇండియా లెవల్, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మొదటి స్థానం సాధించాడు. గురువారం పట్టణంలోని న్యూ ఎక్సీడ్ స్కూల్‌లో స్కూల్ యాజమాన్యం విద్యార్థితోపాటు తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కపిలవాయి చంద్రమోహన్, ప్రిన్సిపాల్ శ్వేత పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న సర్పంచ్

కోడేరు: మండల కేంద్రానికి చెందిన బాబు అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.2లక్షల చెక్కును సర్పంచ్ వెంకటస్వామి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రఘువర్ధన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీశైలం, యాపచెట్టు లాలు, కొమ్ము దానయ్య, ఆది కుర్మయ్య, యాపట్ల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేద, మధ్య తరగతి ప్రజలకు వరం లాంటిదని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా శాసనమండలి సభ్యుడు కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో పట్టణానికి చెందిన ఫాతిమాకు రూ.60 వేలు, అబ్దుల్‌కు రూ.20 వేలు, వెల్దండ మండలం తిమ్మినేనిపల్లికి చెందిన అంజయ్యకు రూ.22 వేల సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాసులు, శానావాజ్‌ఖాన్, ఎజాస్, మాజీ సర్పంచ్ దామోదర్‌గౌడ్, వెంకటేశ్, సురేశ్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల వివరాలను నమోదు చేయాలి

చారకొండ: మండలంలోని ఆయా గ్రామాల్లో దళితబంధు పథకంలో లబ్ధిదారుల వివరాలను నమోదు చేయాలని జెడ్పీ సీఈఓ ఉష అన్నారు. మండల కేంద్రంలో ఎంఆర్‌సీ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ జయసుధ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జెడ్పీ సీఈఓ ఉష హాజరై కార్యదర్శులతో మాట్లాడారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన యూనిట్ ఏవిధంగా వినియోగించుకున్నారు, వారి ఆర్థిక పరిస్థితి, స్టేటస్‌ను సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే ప్రారంభించిన యూనిట్‌లు ఉన్నాయా లేవా అధికారులకు తెలపాలని అన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జయసుధ, ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.